# అమ్మా! నువ్వు నాకొద్దు

మేడ రెండో అంతస్తు గది కిటికీలోనుంచి కిందికి చూచాడు హరి. తమ బంగళా చుట్టూరావున్న కాంపౌండ్ వాల్ అందంగా హుందాగా వుంది. గేటులోనుంచి రాగానే నేరుగా వున్న సిమెంటు చప్టా కిరువేపులావున్న రకరకాల పూలమొక్కలు విరగబూసి బంగళాకే వింత సోయగాన్ని పంచిపెడ్తున్నాయి. కుడిప్రక్కగా వున్న ఫౌంటెన్ గిర గిర తిరుగుతూ నీళ్ళు చిమ్ముతోంది. ఎంతో ఆహ్లాదాన్ని అవన్నీ కల్గిస్తున్నాయని మనసును మభ్య పెట్టుకోవాలని ఎంతసేపుగానో ప్రయత్నిస్తున్నాడు హరి. ఊహుఁ! ఆ కృత్రిమ అలంకారాలలో అందాలలో ఏదో మాలిన్యం ప్రస్ఫుటంగా కన్పిస్తోంది హరికి! అదేమిటి?

"హరీ!"

పరిచిత కంఠస్వరం విని తిరిగిచూచాడు హరి.

సురేఖ నిల్చునివుంది. లేత ఆకుపచ్చ నైలాన్ చీరె. నల్లని వెల్వెట్ స్లీవ్ లెస్ బ్లౌజు, యౌవనాన్ని లాక్కురావాలనే కృత్రిమ ప్రయత్నంతో చేసుకున్న జుగుప్సాకరమైన అలంకరణ. మరొక్కమారు పరీక్షగా చూచాడు తల్లి వేపు. ముఖమంతా రంగు వేసుకుంది. పెదవుల లిప్‌స్టిక్ ఎర్రగా దుర్భరంగా వుంది. చెవులకు వ్రేల్లాడుతున్న రింగులూ, ముత్యాలూ హరి హృదయాన్ని మరింతగా వూపుతున్నాయి-

నొక్కుల నొక్కులజుట్టు అక్కడక్కడా ముఖం మీదికి వచ్చేలా లాక్కుని, పొట్టిగా ముందుకు వేసుకున్న రెండు జడలతో ఏదో కథలో చదివిన కామినీ పిశాచాన్ని గుర్తుకు తెస్తోంది.

"ఏమిట్రా ఆ వెర్రిచూపూ ?" సురేఖ మందలిస్తూ, హైహీల్డ్స్ టకటక లాడిస్తూ, వచ్చి సోఫాలో కూర్చుంది.

"ఏమిటమ్మా ఈ వేషం ?" ఎంతో ప్రయత్నంమీద ఉబికివస్తున్న కోపాన్నణుచుకుంటూ అడిగాడు హరి.

సురేఖ ఉలికిపడింది. కొడుకువేపు తీక్షణంగా చూచింది. ఏమిటో ఎన్నడూ తనక్కలగని అభిమాన మేదో అంతరాంతరాల్లోనుంచి వెలికివచ్చి నరనరాన్నీ నలిపి వేస్తున్నట్లనిపిస్తోందామెకు. హరి అడిగిన ఆ ఒక్క ప్రశ్నతో. తలవని తలంపుగా తనకేసి చూచుకుంది. ఇరవై రెండేళ్ళ కొడుకు తననలా ఆపాదమస్తకమూ పరీక్షిస్తూ, చిరాకుగా ప్రశ్నిస్తుంటే, ఎంత తల్లి అయినా తట్టుకోలేదేమో! లేని గాంభీర్యం తెచ్చుకుంటూ—

"చొప్పదంటు ప్రశ్నలు వెయ్యక ! ఈ రోజు కాలేజికి వెళ్ళలేదేం ?" అంది.

"వెళ్ళలేదు . . . ఇక వెళ్ళను కూడా !"

"ఏం ? ఎందుకని ?"

"దానికి సమాధానం తర్వాత చెబుతాను. ముందు నువ్వెళ్ళి ఆ వేషం మార్చుకురా అమ్మా !" హరి కంఠస్వరం గాద్గదికమై పోయింది.

"నీ కేమైంది హరీ ? డాక్టర్ని పిలిపించనా !" సురేఖ గాభరాగా లేచినిల్చుంది.

గబుక్కున వచ్చి ఆమె రెండు చేతులూ పట్టుకున్నాడు హరి.

వద్దమ్మా ! నాకేమీ కాలేదు...నిన్నిలా చూస్తుంటే నాకు మతిపోతోందమ్మా ! నిన్న నేమైందో తెలుసా ?"

"ఏమయింది ?" కుతూహలంగా అడిగింది సురేఖ. పెదవులపైకి కృత్రిమ చిరునవ్వు తెచ్చుకుంటూ.

"అదో ! ఆ పాడునవ్వే వద్దమ్మా ! సినిమాలలో వేషం వేసివేసి నీప్రతి కదలికా నటనే అయిపోతోంది !" చిరాకు పడ్డాడు హరి. "సర్లే, ఏమయిందో చెప్పు నిన్న."

"ప్రాక్టికల్ ఒకటి పొరపాటు చేశాను. కాలేజి లేబొరేటరీ లోని అద్దాల పెట్టె, అందులోని పరికరాలు ముక్కలయి పోయాయి నా పొరపాటువల్ల. షుమారు రెండువందల రూపాయలు ఖరీదు చేస్తాయి—" హరి ఆపాడు.

"పోనీ ఆ రెండు వందలూ పారెయ్యలేక పోయావ్ ?" సురేఖ ఓదార్పుగా అంది.

"అలాగే అన్నాను. కానీ ఒక్కసారిగా ఫక్కున నవ్వారు తోటివిద్యార్థులూ, లెక్చరరూ అందరూ !"

"ఎందుకూ ?" సురేఖ ఆశ్చర్యంగా చూచింది.

"అదే నాకూ అర్థం గాలేదు ముందుగా లెక్చరర్ భాస్కరరావు నావీపు తట్టాడు నవ్వుతూ ! నీకేం ప్రఖ్యాత

సినిమాతార కొడుకువు! రెండువందలు కాదు రెండు వేలైనా పారేస్తావ్ ! మీ అమ్మ ఒక్క సినిమాలో నటించి సంపాదించే డబ్బుతో, ఇలాటి నాలుగు లేబొరేటరీ లయినా పగలగొట్టి, మళ్ళీ కొనియ్యగలవు నువ్వు. అదికాదు పాయింటు. నీలానే ప్రయోగాలు పాడుచేసి, పరికరాలను విరగ్గొట్టే విద్యార్థులంతా, డబ్బుపారేస్తే తీరిపోతుంది లెమ్మనుకుంటారు' ఇక్కడి కొచ్చింది దర్పం చూపించు కోవటానికిగ్గాదు బుద్ధిగా చదువుకోటానికి ...'' అన్నాడు. అంతా మరోమారు ఘొల్లున నవ్వారు. హరి కళ్లుమూసుకుని సోఫాలో చతికిల పడ్డాడు; సురేఖ క్షణకాలం నిరుత్తర అయింది.

“చూశావా అమ్మా! ఎక్కడి కాలేజి? నా పొరబాటేమిటి? నీ ప్రశక్తి రావాల్సిన అవసరం ఏమిటి? చెప్పు? అంతటితో అయిపోలేదా ఘట్టం!'' హరి బాధగా గతంలోకి వెళ్లాడు.

సురేఖ కింకా వినాలని లేదు; కాని కొడుకు వాగ్ధోరణి ఆపే మార్గమూ, సాహసమూ కూడా కన్పించలేదు.

“కాలేజీ కాంపౌండు దాటామో లేదో నువ్వీ మధ్య నటించిన పిక్చరు తాలూకు బ్యాండు వూరేగింపు వస్తోంది.

“అదుగో సురేఖ! ఎంత బావుందో చూశావ్రా?'' అన్నాడు శ్రీనివాస్ నీ బొమ్మకేసి చూపిస్తూ, నాకు వినపడేలా!

“నీ మొహం! మేకప్ అట్టహాసమేగానీ దాని దగ్గరేముందిరా, నా బొంద-ముసలి పీనుగ! ఇంకా తగుదు

నమ్మా అంటూ హీరోయిన్ రోల్సుకు ఎగబడ్తోంది! నేనే నిర్మాత నయితే ఆవిణ్ణా ఛాయలకికూడా రానుండా......"

ఇక వినలేకపోయాను శ్రీనివాస్‌తోబాటు, మిగతా పాతికమందీ కూడా పొట్ట చెక్కలయిపోయేలా నవ్వారు. నా వెనకాల నడుస్తూ!

"హుష్! కాబోయే హీరో వాడు! వింటే బాధ పడ్తాడు! అదో అప్పుడే మానసిక బాధ ననుభవించే ఎక్స్ ప్రెషన్స్ చూపిస్తున్నాడు. ఫేస్‌లో!" పుండరీకాక్షం మాటలతో మరొకసారి నవ్వులు మిన్నుముట్టాయి! ఒక్క దూకుతో కారులో పచ్చిపడ్డాను..."

సురేఖ చిన్నగా నవ్వింది.

"దాందేముందితే హరీ! పదిమందికి పరిచయమైన ఏ ప్రముఖ వ్యక్తిని గురించైనా ఇలాగే పలువిధాలుగా విమర్శిస్తారు ప్రజలు. మంత్రులనూ, దేశనాయకులనూ విమర్శించటం లేదంటావా? అవన్నీ లెక్కకు తీసుకుంటే ఎలాబాబూ!"

"నిజమేనమ్మా! కానీ నిన్న నా పరిస్థితేమిటో వూహించుకో ఒక్కనిముషం! చెల్లాయినీ అంతేనట వాళ్ళ స్కూల్లో! సినీతారకూతురివి: ఝమ్మని సినిమాల్లోచేరి, ప్రతిఒక్కడితో ప్రేమఘట్టాలు నటిస్తే సరిపోయే! నీకే చదువెందుకమ్మా! మా కంఠశోష మినహా మరేముంటి? అంటారుట మేడమ్స్ ఏ పొరబాటు జరిగినా!"

"అవంతా వాళ్ళ అక్కసు హారీ! అంతస్తులోనూ, కీర్తిలోనూ మనతో సరితూగలేరు. ఆ ఈర్ష్య నలా వెలిబుచ్చుతారు!"

"వాళ్ళ సంగతి వదిలెయ్యమ్మా! మా సంగతిచూడు! నా మటుకు నాకు నిన్నొక్కొక్కసారి చూస్తుంటే అసహ్యం వేస్తుంది! మొన్న నోసారి కుమార్ ఇంటికి వెళ్లాను. కుమార్ తెలుసుగదూ నీకు?"

"చాలా బీదవాళ్ళని చెప్పావు. చాలాసార్లు కాలేజి ఫీజుకూడా కట్టావు అతనికి? అతడే గదూ?"

"అవును! చాలా బీదవాళ్లే! కానీ అతనికున్న ఏదో సంపద, ఏదో తృప్తి, ఏదో ఆనందం నాకు లేవనిపించాయా క్షణంలో!"

సురేఖ పలకలేదు.

"అమ్మా! ఇతడే నా స్నేహితుడు హారి! ఎన్నోమార్లు నన్నాదుకున్నాడమ్మా!" అంటూ కేకేశాడు కుమార్. వాళ్ళమ్మ బయటికి వచ్చింది 'అలాగా నాయనా!' అంటూ కుతూహలంగా! నీ వయస్సే వుంటుందమ్మా ఆవిడికూడా! దట్టమైన ముతకచీరె, రవికే ధరించింది. పమిటె నిండుగా కప్పుకుని వుంది. గట్టిగా చుట్టిన జుట్టుముడితో, నుదుటను పెద్ద బొట్టుతో ఆమె అలా నావేపు చూస్తుంటే, అమృతం వర్షించినట్లయిందమ్మా—ఎన్నోమార్లు నిన్ను చూస్తున్నాను. ఎప్పుడు చూచినా, ఏమిటోగా వుంటావు!"

సురేఖ చిన్నగా నవ్వబోయింది; కానీ ఎందుకో ఆమె కంఠంలో నుంచి నవ్వు సరళంగా రాలేక ఏదో అడ్డుపడినట్లు ఆగిపోయింది; మెల్లిగా తననుతాను సంబాళించుకుంది...

"చూడు హరీ! చిన్న వయసు! అనుభవం తక్కువనీకు! ఆవేశమూ ఎక్కువే! నీకు గుర్తుందా? సరిగ్గా నీకు ఎనిమిదేళ్ల వయస్సుంటుంది! దారిద్ర్యంతో క్రుంగిపోతున్న రోజులవి. బాబూ! నీకు బహుశా గుర్తులేదేమో గాని నాకు బాగా జ్ఞాపకం; కనుమూసినా తెరిచినా ఈనాడా పీడకలలాంటి దృశ్యాలే కన్పిస్తాయి ఒక్కోసారి నాకు! గుండెజబ్బుతో మీనాన్న చనిపోయారు. నువ్వూ, నీచెల్లెలూ నేనూ! చుట్టూరా దారిద్ర్యపు గాఢాంధకారం. బంధువు లెవ్వరూ పట్టెడన్నం పెట్టలేదు! ఎన్నిరోజులు పస్తున్నామో! ఎంతటి నికృష్టపు జీవితం అనుభవించామో తెలుసా?"

హరి మాట్లాడలేదు.

"ఎలాగో అదృష్టం వరించింది; నా అందాన్ని ఎరగా వేశాను నటనాచాతుర్యం చూపాను. బంతిని తన్నినట్లు పైకి వచ్చాను మీకూ, నాకూ ఏలోటూ లేకుండా జీవితం ఆనందంగా గడిచిపోయేలా వసతి ఏర్పరచాను! దారిద్ర్యపు ఛాయ కూడా మనమీద సోకకుండా చూస్తున్నాను...అందుకే వేషం వేస్తే తప్పేముందిరా!"

"అదే నీ పొరపాటమ్మా! దారిద్ర్యాన్ని తరమగలిగావు. కానీ శాశ్వతమైన మాలిన్యాన్ని నీకూ, మాకూ

కూడా పట్టించావు. పోనీ! ఇప్పుడు నువ్వుకోరిన స్థితికి వచ్చావుగదా? ఇంకా నీ ఈ వేషమేమిటి చెప్పు?"

సురేఖ దిమ్మెరపోయింది! ఏమని చెప్పాలి? అనేదే సమస్యయింది. "చూడు బాబూ! హరీ! సిరీ, కీర్తి రెండూ మనం కోరినప్పుడు వచ్చేవి గావు! అవి వస్తున్నపుడు పిచ్చి కారణాలు చెప్పుకొని, నిరాకరించటం అవివేకం! ఎలాగూ ఒక మార్గంలోకి అడుగెట్టాం! అలాగే సాగుదాం! ఇప్పుడు నేనేం తప్పుచేస్తున్నాననీ నీ బాధ? కళాసాధన చేస్తున్నాను...కళామతల్లికి సేవ చేస్తున్నాను..."

"అంటే నీ కీ మార్గమే బాగుందంటావు! కానీ మరో నాలుగురోజులు పోయాక అయినా నీ మార్గాన్ని మార్చుకోక తప్పదేమో!" అన్నాడు హరి కోపంగా.

"అంటే?"

"ఎంతో శ్రమపడినా నువ్విప్పుడు అసలు వయసును దాచలేకుండ వున్నావమ్మా! మరికొన్నిరోజులు జరిగాక, నిర్మాతలూ, ప్రేక్షకులూ కూడా ఆ మాట నీముందే చెప్పేస్తారు! అమ్మా ఎందుకీ శుష్క వాదన? ఎంత దారిద్ర్యంలో మగ్గినా, ఆనాడు నీకున్న గౌరవంవేరు! ఎంత పేరుప్రతిష్టలు సంపాదించినా ఈనాడు నీమీద అందరూ నిలుపుతున్న దృష్టి వేరు! 'నీ తల్లి ఫలానా;' అంటూ నలుగురూ నన్ను చూపిస్తుంటే, నన్ను నేను చంపుకోవా లనిపిస్తోందమ్మా!"

సురేఖ పలకలేదు!

"ఒకప్పుడు మా అమ్మ పేరు 'సుబ్బలక్షమ్మ' అని చెప్పుకునేవాణ్ణి గర్వంగా! ఇప్పుడు 'సురేఖ' అనబోతే తడబడి పోతున్నాను. ఒకప్పుడు వయసుకు దగ్గ నీ అలంకరణను చూచి చనువుగా నీ వడిలోకి పరుగుత్తుకు వచ్చేవాణ్ణి! ఇప్పుడెందుకో నిన్ను పరీక్షగా చూడాలంటేనే భయం వేస్తోందమ్మా!"

"చాల్లే వెధవ్వాగుడూ నువ్వూ! కాలేజీ టైం కావస్తోంది కారు రెడీగావుంది; వెళ్లు హరీ! నాకూ షూటింగొకటుంది!" సురేఖ కాఠిన్యాన్ని అరువు తెచ్చుకుంటూ లేచి నిల్చుంది.

"అమ్మా!" హరి అరుపుకు రూము ప్రతిధ్వనించింది.

"నే వెళ్ళను; అంతేకాదు... ఇక ఒక్క క్షణంకూడా వుండ నిక్కడ! నే వెళ్ళిపోతున్నాను!" అన్నాడు.

"ఎక్కడికి?" గాభరాగా అడిగింది. సురేఖ!

"ఎక్కడికో! ప్రశాంతమైన ప్రకృతి తల్లి వడిలోకి వెళ్తాను! తన శీలసంపదతో, తన వయోరూప లక్షణాలతో, బిడ్డలను తన ఎదలో దాచుకుని రక్షించగల నీ తల్లి ఏనాడో చచ్చిపోయింది! ఇప్పుడున్న అమ్మ డబ్బు సంపాదించే ఒక యంత్రం! ఆ డబ్బుతోపాటు, తన బిడ్డలకు అప్రదిష్టా, అవమానాలూ సమంగా పంచి ఇస్తున్న ఓ కృత్రిమయౌవనరాశి! ఈ అమ్మ నాకొద్దు! అమ్మా నువ్వు నాకొద్దు!"

హరి గబగబా మేడ మెట్లు దిగి పరుగెత్తాడు. సురేఖ వారిద్దామనుకుని ఒక అడుగు ముందుకు వేసింది. కానీ ఏ బల వత్తరశక్తో ఆమె నోరు పెగలనివ్వలేదు. ఎదురుగా నిలువు టద్దంలో కన్పించిన తన ప్రతిబింబాన్ని చూచి కలవరపడింది సురేఖ.

నెరిసిన జుట్టుముడితో, ముడుతలుపడ్డ ముఖంతో, కళావిహీనమై వృద్ధాప్యంలో అడుగెట్టిన సుబ్బలక్ష్మమ్మ రూపం, తన రెండుజడల కేసి, చెవుల రింగుల కేసి, అన్నిటికంటే ఎక్కువగా తను ధరించిన బట్టల కేసి వేలు చూపిస్తూ విరగబడి నవ్వుతోంది అద్దంలో !